# ఆకాశవాణి, ప్రాంతీయ వార్తా విభాగం

# విశాఖపట్నం కేంద్రం

# ప్రాంతీయ వార్తలు

తేదీ: 09-12-2024 సమయం : సాయంకాలం 6 గం. 10 ని. లు

## ముఖ్యాంశాలు

- ❖ రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బిఐ) నూతన గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు.
- ❖ ఖరీఫ్ సీజన్ కు సంబంధించి ఇప్పటి వరకూ 54 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.
- ❖ ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ ఎమ్మెల్సీగా బొర్రా గోపీ మూర్తి విజయం సాధించారు.
- ❖ రైతులకు 145 కోట్ల రూపాయలతో యంత్ర పరికరాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలియజేశారు.
- ❖ ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రేపు రాష్ట్రంలో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలియజేసింది.

=======================

రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బిఐ) నూతన గవర్నర్ గా సంజయ్ మల్హోత్రా నియమితులయ్యారు. సంజయ్ మల్హోత్రా నియామకానికి క్యాబినెట్ నియామకాల కమిటీ ఈరోజు ఆమోదం తెలిపింది. రాజస్తాన్ కేడర్ 1990 ఐఏఎస్ బ్యాచ్ కు చెందిన సంజయ్ మల్హోత్రా ప్రస్తుతం కేంద్ర రెవెన్యూ శాఖ కార్యదర్శిగా పని చేస్తున్నారు. ఆయన ఈ పదవిలో ఈ నెల 11 నుండి మూడు సంవత్సరాల పాటు కొనసాగనున్నారు.

=======================

రాష్ట్ర పౌరసరఫరాల శాఖా మంత్రి, జనసేన పార్టీ పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్ ఈరోజు విజయనగరం జిల్లాలో పర్యటించారు. విజయనగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మృతి చెందిన జనసేన పార్టీ కార్యకర్తల కుటుంబాలకు 5 లక్షల రూపాయల చొప్పున పరిహారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... పార్టీలో

ప్రతి కార్యకర్తకూ ప్రాధాన్యం ఉంటుందని తెలిపారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఈ సంవత్సరం ఖరీఫ్ సీజన్ లో ఇప్పటికే 54 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని కొనుగోలు చేశామని మంత్రి వెల్లడిస్తూ...

(వాయిస్ 26 సెకన్లు)

=====================

ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల ఉపాధ్యాయ శాసనమండలి ఎమ్మెల్సీగా బొర్రా గోపీ మూర్తి విజయం సాధించారు. పీడీఎఫ్ బలపరిచిన గోపీ మూర్తికి పోలైన15 వేల 490 ఓట్లలో 8 వేల 929 తొలి ప్రాధాన్యతా ఓట్లు లభించాయి. ఈ విజయం దివంగత ఎమ్మెల్సీ షేక్ షాబ్జీకి అంకితమని ఎన్నికల ఫలితాల అనంతరం గోపి మూర్తి అన్నారు. ఇది ప్రజాస్వామ్య విజయమని.. రెండు జిల్లాల అధ్యాపకులకు ధన్యవాదాలు తెలియజేశారు. ఉపాధ్యాయ సమస్యలపై పోరాడుతానని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

=====================

రైతులకు 145 కోట్ల రూపాయలతో యంత్ర పరికరాలు ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖా మంత్రి కె. అచ్చెన్నాయుడు తెలియజేశారు. పార్వతీపురం మన్యం జిల్లాలో ఈరోజు మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ... రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని, అధికారంలోకి వచ్చిన 6 నెలల్లోనే అన్ని శాఖలపై సమీక్షలు చేపట్టి వ్యవస్థలను సరైన రీతిలో పెట్టామన్నారు. ధాన్యం కొనుగోళ్లపై ఒక్క రైతు కూడా ఫిర్యాదు చేయలేదని, అన్నదాత సుఖీభవ ద్వారా త్వరలో రైతులకు 20 వేల రూపాయలు ఇస్తామని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు.

=====================

విజయవాడలో సబ్ జైలును హోం మంత్రి వంగలపూడి అనిత ఈరోజు ఆకస్మికంగా సందర్శించి ఖైదీలతో ముఖాముఖి నిర్వహించారు. సబ్ జైలు మౌలిక వసతులపై వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ... జైలు అధికారులపై వస్తున్న ఆరోపణలపై వివరాలు సేకరించామని, విచారణ జరుగుతోందని తెలిపారు. నివేదిక వచ్చిన వెంటనే చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. తప్పు చేసిన వారిని తప్పకుండా శిక్షిస్తామని వారిపై ఖచ్చితంగా నిఘా ఉంటుందని స్పష్టం చేశారు.

=====================

మహిళలు అన్ని రంగాల్లోనూ రాణించాలని ఆంధ్రప్రదేశ్ మహిళా ఆర్థిక సహకార సంస్థ అధ్యక్షురాలు కావలి గ్రీష్మ అన్నారు. విజయనగరంలో ఉన్న మహిళా ప్రాంగణాన్ని ఈరోజు ఆమె సందర్శించి శిక్షణ పొందిన మహిళలతో మాట్లాడారు. ఏయే విభాగాల్లో శిక్షణ పొందారని అడిగి తెలుసుకున్నారు. బ్యూటీషియన్, మగ్గం వర్క్, టైలరింగ్ లో శిక్షణ పొందిన 90 మంది మహిళలకు సర్టిఫికెట్లు అందజేశారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ...

(వాయిస్ 23 సెకన్లు)

విరామం

=====================

ఇటీవల ఖాళీ అయిన మూడు రాష్ట్రాల రాజ్యసభ స్థానాలకు భారతీయ జనతా పార్టీ అభ్యర్థులను ప్రకటించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి బీసీ సంఘం జాతీయ అధ్యక్షులు ఆర్.కృష్ణయ్యను ఎంపిక చేసింది. ఆర్.కృష్ణయ్యతో పాటు హరియాణా నుంచి రేఖాశర్మ, ఒడిశా నుంచి సుజిత్ కుమార్‌ను అభ్యర్థులుగా బిజెపి ప్రకటించింది. కాగా షెడ్యూల్

ప్రకారం రాజ్యసభకు ఈనెల 20న ఉప ఎన్నికలు నిర్వహించి అదేరోజు ఫలితాలను ప్రకటిస్తారు. ఆంధ్రప్రదేశ్ నుంచి 3, ఒడిశా, పశ్చిమబెంగాల్, హర్యానా నుంచి ఒక్కో సీటు ఖాళీగా ఉన్నాయి.

=======================

వృద్ధాప్యంలో ఉన్న తల్లిదండ్రుల పోషణ బాధ్యత పిల్లలే తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా డిప్యూటీ కలెక్టర్ ధర్మచంద్రా రెడ్డి అన్నారు. ఈరోజు పార్వతీపురం సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయ ప్రాంగణంలోని గిరిమిత్ర సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో గిరిజనాభివృద్ధి సహాయ ప్రాజెక్టు అధికారి మురళీధరన్ తో కలిసి ప్రజల నుంచి 114 వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. బాల్యం నుండి ఉద్యోగం వచ్చే వరకు పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను వృద్ధాప్యంలో విస్మరించిన వారికి చట్ట ప్రకారం శిక్ష తప్పదని తెలిపారు. ప్రతీ వారం పిజిఆర్ఎస్ కు వచ్చే ఫిర్యాదులను సాధ్యమైనంత త్వరగా పరిష్కరించాలని అధికారులకు ఆయన సూచించారు.

=======================

ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో రేపు అల్లూరి సీతారామరాజు, కాకినాడ, కోనసీమ, పశ్చిమ గోదావరి, కృష్ణా, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీ సత్యసాయి, వైఎస్ఆర్ జిల్లాల్లో కొన్ని చోట్ల తేలికపాటి వర్షాలు పడే అవకాశం ఉందని ఆంధ్రప్రదేశ్ విపత్తుల నిర్వహణ సంస్థ తెలిపింది. బుధవారం నుంచి శుక్రవారం వరకు కోస్తా, రాయలసీమలో ముఖ్యంగా చిత్తూరు, తిరుపతి, అన్నమయ్య జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని పేర్కొంది. రైతులు తమ వ్యవసాయ పనుల్లో జాగ్రత్తలు తీసుకోవాలని, పండించిన ధాన్యాన్ని సురక్షిత ప్రదేశాలలో ఉంచుకోవాలని సూచించింది.

=======================

విశాఖ డెయిరీలో జరిగిన అవకతవకలను తెలుసుకునేందుకు ఏర్పాటు చేసిన అసెంబ్లీ సభా సంఘం ఈరోజు డెయిరీని పరిశీలించింది. శాసన సభ్యులు జ్యోతుల నెహ్రూ ఆధ్వర్యంలో హౌస్ కమిటీ విశాఖ డెయిరీని పరిశీలించింది. అనంతరం జ్యోతుల నెహ్రూ పాత్రికేయులతో మాట్లాడుతూ.. పరిశీలన తర్వాత సందేహాలు మరింత పెరిగాయని, నిపుణుల కమిటీ సహకారం తీసుకుంటామని చెప్పారు. డెయిరీ విషయంలో పాడి రైతులను అడిగితే డబ్బులు తగ్గించారంటున్నారని, యాజమాన్యం మాత్రం అదేమీ లేదని చెబుతోందని హౌస్ కమిటీ సభ్యులు పల్లా శ్రీనివాసరావు పాత్రికేయులకు తెలియజేస్తూ…

(వాయిస్ 36 సెకన్లు)

=======================

వాతావరణ శాఖ అధికారులు హెచ్చరికలు నేపథ్యంలో ఈ నెల 12వ తేదీ తర్వాతే వరి కోతలు, నూర్పులు చేయాలని శ్రీకాకుళం జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ రైతులను కోరారు. జిల్లాలో తుఫాను కారణంగా ఈ నెల 11, 12 తేదీల్లో వర్షాలు వచ్చే అవకాశాలు ఉన్నట్లు పేర్కొన్నారు. ఈరోజు శ్రీకాకుళం జిల్లా పరిషత్ లో సంయుక్త కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ తో కలసి ఆయన పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. వరి కోతలు ఇప్పటికే పూర్తై కుప్పలు వేసి ఉంటే ఈ నెల 12వ తేదీ తర్వాత నూర్పులు వేసుకోవాలని రైతులను కోరారు. వరి పైరు కోసేసి ఉంటే వెంటనే కుప్పలు వేసుకోవాలని తెలిపారు. ధాన్యం నూర్చి కళ్ళాల్లో సిద్ధంగా ఉన్నట్లు తెలియజేస్తే.. ధాన్యం సేకరణకు మిషనరీ మిల్లర్లు సిద్ధంగా ఉన్నారని కలెక్టర్ తెలిపారు.

=======================

రాష్ట్రంలో రైతులు, విద్యుత్ వినియోగదారులు, విద్యార్థులు అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని శాసన మండలి సభ్యులు బొత్స సత్యనారాయణ అన్నారు. ఈరోజు ఆయన విశాఖపట్టణంలో ఏర్పాటు చేసిన పాత్రికేయుల

సమావేశంలో మాట్లాడుతూ.. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని, పంటల బీమా పథకాన్ని తిరిగి అమలు చేయాలని కోరుతూ.. ఈ నెల 13వ తేదీన అన్ని జిల్లాల కలెక్టర్లకు వినతిపత్రం ఇస్తామని తెలిపారు. అలాగే ట్రూ అప్ విద్యుత్ చార్జీల భారాన్ని ప్రజలపై వేయకుండా ప్రభుత్వమే భరించాలంటూ.. విద్యుత్ సూపరింటెండెంట్ లకు, పవర్ డిస్ట్రిబ్యూషన్ కంపెనీ అధికారులకు వినతిపత్రం ఇవ్వనున్నామని వెల్లడించారు.

========================

========================